సాక్షి
విశాఖపట్నం
శనివారం ; 5 ; ఆగస్టు ; 2023



మొక్కలు పెంచుదాం

డిప్యూటీ కమాండెంట్, ప్లాంటేషన్ డ్రైవ్ నోడల్ ఆఫీసర్ భగత్‌సింగ్ సారథ్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. 8లో



తిరుమలలో మేయర్

మేయర్ హరి వెంకట కుమారి, శ్రీనివాస్ దంపతులు శుక్రవారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. 8లో

ప్రియుడి మోజులో భర్తనే కడతేర్చింది



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రమేష్ మృతి విషయంలో తొలి నుంచి అనుమానిస్తున్నదే జరిగింది. శివజ్యోతి అలియాస్ శివానీయే ఆమె ప్రియుడితో కలిసి తన భర్త రమేష్ హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసుల విచారణలో తేలింది. 8లో

న్యూస్‌రీల్

7న సీఎం జగన్ కూనవరం పర్యటన



కూనవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు కూనవరంలో పర్యటించనున్నారు. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో బాధితులను నేరుగా కలిసి వారి కష్టసుఖాలను తెలుసుకుంటారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ శనివారం తెలిపారు. ఈనెల 4న కూనవరంలో జరగాల్సిన సీఎం పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే.

వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుకు దరఖాస్తులు

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని విశిష్ట ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. తగిన ఆధారాలతో దరఖాస్తును ఒక పేజీకి మించకుండా చిరునామా, ఫోన్‌నంబర్, ఈ మెయిల్, ప్రతిభా వివరాలతో ఈమెయిల్‌ను sportsinap@gmail.com, dsa.vsp@rediffmail.com లకు ఆగస్టు 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు పంపుకోవాలి.

నేడు రైతు బజార్లలో టమాటాల విక్రయం



సీతమ్మధార : జిల్లాలోని 13 రైతు బజారుల్లో 21 టన్నుల టమాటాలు శనివారం విక్రయించనున్నామని మార్కెటింగ్ శాఖ ఏడీఎం షేక్ యాసిన్ తెలిపారు. చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి విశాఖకు 21 టన్నుల సబ్సిడీ టమాటాలు వచ్చాయన్నారు. ఆయా రైతు బజార్లలో కిలో రూ.50లకు విక్రయిస్తామన్నారు.

విశాఖ అథ్లెట్ జ్యోతికి కాంస్యం



కాంస్య పతకం సాధించిన జ్యోతి

విశాఖ స్పోర్ట్స్ : చైనాలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో నగర అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి కాంస్య పతకాన్ని సాధించింది. వుమెన్ వంద మీటర్ల హర్డిల్స్‌లో ఈ పతకాన్ని సొంతం చేసుకుంది. ఇటీవలే ఆసియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో వంద మీటర్ల హార్డిల్స్‌లో స్వర్ణం సాధించి డబ్ల్యూజీలో పోటీపడింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరపున ఈ పోటీల్లో పాల్గొంది.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించండి



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

అల్లిపురం: సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులపై నగర ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నగరంలో విరివిగా వర్షాలు పడుతున్న దృష్ట్యా దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిశరాలు పొడిగా ఉంచుకునే విధంగా చూడాలన్నారు. ఇంటి పరిశరాలలో ఖాళీ సీసాలు, టైర్లు ఉంచకూడదని, అలాగే పూల కుండీలు, ఫ్రిడ్జ్ వెనుక భాగంలో నీరు, నీటి తొట్టెలు మొదలగునవి పొడిగా ఉంచుకోవాలన్నారు.

విశాఖ విమానాశ్రయం వేళలు పొడిగించాలి

దొండపర్తి: విశాఖ విమానాశ్రయం రన్‌వే రీ-సర్ఫేసింగ్ పనుల నిమిత్తం 11 గంటల పాటు విమాన రాకపోకలను నిలిపివేస్తున్నట్లు నేవీ ప్రకటించిన సమయాన్ని 8 గంటలకు కుదించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు శుక్రవారం లేఖ రాశారు. 11 గంటల పాటు రాకపోకలను నిలిపివేయడంతో 12 సర్వీసులకు అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. సింగపూర్ విమాన సర్వీస్‌తో పాటు ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, పూణె సర్వీసులకు విఘాతం ఏర్పడుతుందన్నారు. ప్రతి రోజు రాత్రి 10.30 నుంచి ఉదయం 6.30 వరకు మాత్రమే ఎయిర్‌పోర్ట్‌ను మూసివేసేలా అనుమతించాలని కోరారు.

విశాఖలో.. అభివృద్ధి వికాసం..



భీమిలి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, జేసీ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు వద్దకు చేర్చడంలో అధికారులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. డిసెంబర్ నాటికి రీసర్వే పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో భీమిలి, పెందుర్తి, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల సమీక్ష సమావేశాన్ని మంత్రి రజిని, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో మంత్రి విడదల రజిని సమీక్షించారు.

ఈ సమీక్షలో భాగంగా రెవెన్యూ, జీవీఎంసీ, నాడు -నేడు, ప్రాధాన్యతా భవనాలు, గడప గడపకు మన ప్రభుత్వం , పంచాయతీ రాజ్ తదితర అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ముందుగా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆయా నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ సమీక్షలో జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జేసీ కేఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, కార్పొరేటర్లు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

- ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- భీమిలి,పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రజిని, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సమీక్ష
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా అధికారులకు ఆదేశం

భీమిలి నియోజకవర్గంలో..

నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వివరించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరలోనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గమని , దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. గోస్తని నదిపై బ్రిడ్జి పనులు చేపట్టాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలం సిద్ధంగా ఉందని పనులకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తెలిపారు. అనంత పద్మనాభ స్వామి దేవాలయం ఘాట్ రోడ్ పనులు చేపట్టాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రోడ్ల పనులు తిరిగి ప్రారంభించాలన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్ దగ్గర ప్రమాదాలు నివారణకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ముత్తంశెట్టి కోరారు. బోయవీధి, వేములవలస, కోరాడ, ఐనాడ , మజ్జివలస , లక్ష్మీపురంలో ఇళ్ల పట్టాలు, పలు చోట్ల భూముల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై చర్చించారు.

- మంత్రి విడదల రజిని మాట్లాడుతూ నియోజకవర్గంలో జీవో నం.388 ద్వారా 3010 అభ్యంతరం లేని ఆక్రమణలకు కన్వేయన్స్ డీడ్ పొందేందుకు చర్యలు చేపట్టామని, 1957 మందికి కన్వేయన్స్ డీడ్ పూర్తి చేశామన్నారు. సింహాచలం బీఆర్టీఎస్ పనుల్లో భాగంగా మొదటి దశ గోశాల నుంచి తొలి పావందా వరకూ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. మధురవాడలో ఆగస్టు నెలాఖరుకు ఆరు చోట్ల రహదారి విస్తరణ పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అనంత పద్మనాభ స్వామి దేవాలయం ఘాట్ రోడ్డు పనులు త్వరలోనే చేపడతామన్నారు. జగనన్న కాలనీలో ఇళ్లు పొందిన లబ్ధిదారులు ఎవరైనా చనిపోయినట్లయితే వారి వారసులకు ఆ స్థలం అందించాలని కలెక్టర్‌కు సూచించారు.
- కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 19 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి చేశామన్నారు.
- సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు , కార్పొరేటర్లు తమ పరిధిలోని సమస్యలను మంత్రి, అధికారులు దృష్టికి తీసుకొచ్చారు.

పశ్చిమ నియోజకవర్గం



మాట్లాడుతున్న మంత్రి విడదల రజని, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్

ఏపీఎంఎస్ఎండీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. సింహభాగం పనులు రైల్వే శాఖతో సంబంధించినవి ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. ఎన్ఏడీ ఫ్లైఓవర్ వద్ద లోయర్ రోటరీలో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు కృషి చేయాలన్నారు. గోపాలపట్నంలో ముస్లిం సామాజిక వర్గానికి శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టాలని కోరారు.

- మంత్రి రజిని మాట్లాడుతూ నియోజకవర్గం గోపాలపట్నం, ములగాడ పరిధిలో జీవో నం.388 ద్వారా 546 అభ్యంతరం లేని ఆక్రమణలకు కన్వేయన్స్‌డీడ్ పొందేందుకు చర్యలు చేపట్టామని, 466 మందికి కన్వేయన్స్ డీడ్ పూర్తి చేశామన్నారు.
- గోపాలపట్నం బాజీ జంక్షన్ వద్ద మోడ్రన్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి వారంలోగా స్థల గుర్తింపు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. నియోజకవర్గంలో తూర్పు కాపు, రెడ్డిక, కళింగ వైశ్యులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాల జారీలో సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. జీవీఎంసీకి సంబంధించిన పనుల్ని తక్షణమే ప్రారంభించాలని కమిషనర్‌ని ఆదేశించారు.
- వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో హెచ్‌పీసీఎల్, రైల్వే, పోర్టుకు సంబంధించిన భూములు అధికంగా ఉన్నాయని, ఈ సంస్థలతో సమస్యలు పరిష్కరించేందుకు తక్షణమే సమన్వయ సమావేశం నిర్వహించాలని అధికారుల్ని ఆదేశించారు. నియోజకవర్గంలో ఉన్న ముఖ్యమైన పనులను శీఘ్ర గతిన ప్రారంభించి పూర్తి చేయాలన్నారు.
- కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం పనులలో భాగంగా 14 వార్డులలో అనుమతి పొందిన 73 పనులకు గాను 38 పనులను పూర్తి చేసినట్లు వివరించారు.
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రైల్వే అనుమతులు పొందవలసి ఉందని, త్వరలోనే రైల్వే శాఖతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.
- నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలను ఆయా వార్డు కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు.

పెందుర్తి నియోజకవర్గం..



మాట్లాడుతున్న మంత్రి విడదల రజని, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే అదీప్ రాజ్

పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో యూజీడీ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 88వ వార్డు కోట నరవ రహదారి వంపు వలన ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని, అందుబాటులో గల ప్రభుత్వస్థలం మీదుగా రహదారి విస్తరణ చేయాలని కోరారు. పార్లుపాలెం గ్రామానికి వెళ్లే రహదారి విస్తరణకు ఆంధ్రా సిమెంట్స్ కంపెనీ అభ్యంతరం పెడుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. చింతల అగ్రహారంలో యూజీడీ పనులను పూర్తి చేసేందుకు తీసిన గోతులను వెంటనే పూడ్చి రహదారి నిర్మిస్తే ప్రజల నుంచి అభ్యంతరం ఉండదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తన నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్పొరేటర్లు తమ పరిధిలో ఉన్న సమస్యల్ని అధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

- మంత్రి రజని మాట్లాడుతూ నియోజకవర్గంలో జీవో నం.388 ద్వారా 500 చ.గ. వైశాల్యం ఉన్న 156 అభ్యంతరం లేని ఆక్రమణలకు కన్వేయన్స్ డీడ్ పొందుటకు చర్యలు చేపట్టామనీ.. వంద చ.గజాలు విస్తీర్ణం గల ఆక్రమణలకు 438, 100 కంటే తక్కువ విస్తీర్ణం గల ఆక్రమణలకు 361 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 550 దరఖాస్తులు డీడ్ పొందేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. రాంపురం, పినగాడి, లక్ష్మీపురం గ్రామాల లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ కోసం పినగాడిలో గుర్తించిన సర్వే నం. 141/1లో ఉన్న రైతులు కోర్టుకు వెళ్లి ఆర్డరు తెచ్చుకున్నందున ప్రత్యామ్నాయంగా చింతగట్ల గ్రామంలో సర్వే నం. 58 లోని అసైన్డ్, ప్రభుత్వభూమి 11 ఎకరాలు గుర్తించామని, దీనికి సంబంధించిన భూ సమీకరణకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు తక్షణమే దృష్టిసారించాలని సూచించారు.
- కలెక్టర్ డా. మల్లికార్జున, జేసీ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ చీమలాపల్లి డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమికి ప్రహారీ నిర్మించనున్నట్లు తెలిపారు. చీమలాపల్లి అప్రోచ్ రోడ్డు సమస్యను 15 రోజులలో పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ప్రహ్లాదపురం యూపీహెచ్‌సీ స్థల కేటాయింపు సమస్యని వారం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.
- జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల్ని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



గ్రైస్ విద్యార్థినికి ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న కమిషనర్ నాగరాణి

మురళీనగర్ (విశాఖ ఉత్తర): మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మనం మారాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి చెప్పారు. విశాఖ పర్యటనలో భాగంగా ఆమె కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక విభాగంలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇండస్ట్రియల్ కనెక్టెడ్ కోర్సులను నేర్చుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెకట్రానిక్స్, రోబోటిక్స్, ఏఆర్‌వీఆర్, సీఎస్‌సీ, డ్రోన్ టెక్నాలజీ వంటి కోర్సులు చేసిన వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆమె వివరించారు. సంప్రదాయ కోర్సులతో పాటు ఉపాధి అవకాశాలు పెంచే కోర్సులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు ప్రాధాన్యం

ఈ ఏడాది కూడా పరిశ్రమల అవసరాలను తీర్చే విధంగా ఎక్కువ మంది ఉద్యోగాల్లో చేరేందుకు విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఇంటర్వ్యూలకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందించే విధంగా శిక్షణ నివ్వాలన్నారు. ఇందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరిశ్రమలకు అవసరమైనంత మందిని మనం ఇవ్వాల్సి ఉందన్నారు. కెరీర్ గైడెన్స్ ఇవ్వాలన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తికాగానే వంద శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందే విధంగా కృషి జరగాలన్నారు. కంపెనీలతో ఎంవోయూలు చేసుకోవడంతో పాటు వారితో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కాలేజీ సిబ్బంది వారి బ్రాంచ్‌లకు సంబంధించిన ఆధునిక పోకడలను తెలుసుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచే విధంగా నూతన ప్రాజెక్టులు రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్‌కు (ఎన్‌బీఏ) విశాఖ నగరం నుంచి అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు చెందిన అన్ని బ్రాంచ్‌లు గుర్తింపు పొందాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఆముదాలవలస, శ్రీకాకుళం, అనకాపల్లి, విజయవాడ, గన్నవరం, కుప్పం, కళ్యాణ దుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు పొందినట్లు చెప్పారు. ఇతర కాలేజీలు కూడా ఎన్‌బీఏ గుర్తింపు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీ కూడా ఎన్‌బీఏ గుర్తింపునకు వెంటనే వెళ్లాలని ఆమె ఆదేశించారు.

ఈ సందర్భంగా ఇటీవల బిర్లా కంపెనీలో ఉద్యోగాలు పొందిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గ్రైస్) బాలికలకు నియామకపత్రాలను ఆమె అందించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సెమ్స్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మెకట్రానిక్స్, రోబోటిక్స్, ఏఆర్‌వీఆర్, సీఎస్‌సీ కోర్సులలో జరుగుతున్న తరగతులను, ల్యాబరేటరీలను ఆమె పరిశీలించారు.

'అమృత భారత్'తో రైల్వే స్టేషన్ల అభివృద్ధి

- దువ్వాడ స్టేషన్ ఆధునికీకరణకు రేపు భూమిపూజ
- వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ శ్రీకారం
- డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): అమృత భారత్ పథకం కింద దేశ వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు భారతీయ రైల్వే శ్రీకారం చుట్టిందని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 1309 స్టేషన్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించిందన్నారు. వీటిలో పలు స్టేషన్లకు సంబంధించి ఆధునీకరణ పనులకు ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో 25 స్టేషన్‌లు ఎంపిక కాగా, వీటిలో వాల్తేర్ డివిజన్ పరిధిలో మొత్తం 15 స్టేషన్‌లు ఉన్నాయని చెప్పారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్, దువ్వాడ, బొబ్బిలి జంక్షన్, జగదల్‌పూర్, సింహాచలం, పార్వతీపురం , చీపురపల్లి, జైపూర్, నౌపడ జంక్షన్, దమన్‌జోడి, అరకు, కోరాపుట్, కొత్తవలస, పర్లాకిమిడి స్టేషన్‌లు ఎంపికయ్యాయన్నారు. వీటిలో దువ్వాడ, విజయనగరం, దమన్‌జోడీ స్టేషన్లకు ఆదివారం ఉదయం ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో భూమి పూజ చేస్తారని డీఆర్ఎం తెలిపారు. దువ్వాడ స్టేషన్‌ను రూ.26.31కోట్లు, విజయనగరం స్టేషన్‌ను రూ.35.16కోట్లు, దమన్‌జోడీ స్టేషన్‌ను రూ.13.93 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు.

ఎంపికైన స్టేషన్లలో అభివృద్ధి ఇలా..

- ఈ స్టేషన్లను సిటీ సెంటర్స్‌గా అభివృద్ధి చేస్తారు.
- స్టేషన్లకు రెండు వైపులా ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేస్తారు.
- స్టేషన్ భవనాల అభివృద్ధి, పునర్నిర్మాణానికి చర్యలు
- అత్యంత ఆధునికతతో కూడిన సదుపాయాల కల్పన
- ప్రయాణికులకు సమాచారం తెలియజేసే సిస్టంలను ఆధునికంగా, ఒకే రకంగా ఏర్పాటు చేస్తారు.
- ల్యాండ్ స్కేపింగ్, స్థానిక కళలు, సాహిత్యం వంటి వాటిని ప్రదర్శిస్తారు.

● భలేభలే 'బస్ బే'..



విశాఖ నగరం సరికొత్తగా దర్శనమిస్తోంది. జీవీఎంసీ నిర్మించిన బస్‌బే (బస్ షెల్టర్లు) ఆకర్షణీయంగా, విద్యుత్ కాంతులతో సౌకర్యవంతంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే పలువురు ప్రయాణికులు కొత్త బస్ బేలు భలే ఉన్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి గురుద్వారా బస్ బే విద్యుత్ వెలుగుల్లో జిగేల్‌మంది.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

శ్రీవారి ఆలయం అద్భుతం



శ్రీవారి సన్నిధిలో సంజయ్‌కుమార్

కొమ్మాది: సాగరానికి అభిముఖంగా, ఎత్తైన కొండపై ప్రశాంతమైన వాతావరణంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఎంతో అద్భుతంగా ఉందని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) అండర్ సెక్రెటరీ సంజయ్ కుమార్ అన్నారు. రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ శ్రీవారి దర్శనం మనసుకు ఎంతో ప్రశాంతత కలిగిందన్నారు. ఆయనకు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాదాన్ని అందజేశారు.

పాపువా న్యూ గినియాకి చేరిన భారత యుద్ధ నౌకలు



భారత యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ కోల్‌కతా సిబ్బందితో పాపువా న్యూ గినియా ప్రధాన మంత్రి జేమ్స్ మరాపే

సింధియా: హిందూ మహా సముద్రంలో గస్తీ నిర్వహణలో భాగంగా పాపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోర్స్‌బేకి భారత యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ కోల్‌కతా చేరుకున్నాయి. ఈ యుద్ధ నౌకలను ఆ దేశ ప్రధానమంత్రి జేమ్స్ మరాపే సందర్శించారు. కేబినెట్ సభ్యులు, సీనియర్ ప్రభుత్వ అధికారులతో కలిసి సందర్శనకు వచ్చిన ప్రధాని జేమ్స్ మరాపేకు భారత నావికాదళం, భారత హైకమిషనర్ ఇన్బాశేఖర్ సుందరమూర్తి ఆతిథ్యం ఇచ్చారు. మే 23వ తేదీన మన దేశ ప్రధాని మోదీ పాపువా న్యూ గినియా సందర్శించినందుకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారత్, పాపువా న్యూ గినియా దేశాల సత్సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేస్తున్న కృషి ప్రశంసించారు. దేశ రక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేసే దిశగా మరిన్ని నౌకల సందర్శనలను ప్రోత్సహిస్తామని జేమ్స్ మరాపే వెల్లడించారు.

మొక్కల సంరక్షణ దేశ సేవతో సమానం

- 198 సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్
- గాయత్రి కళాశాలలో మొక్కలు నాటిన జవాన్లు, విద్యార్థులు



నాటడానికి మొక్కలతో సిద్ధమైన అధ్యాపకులు, జవాన్లు, విద్యార్థులు

మధురవాడ: పర్యావరణ పరిరక్షణలో ఎంతో ముఖ్య భూమిక పోషిస్తున్న మొక్కలు నాటి, సంరక్షించడం కూడా దేశానికి సేవ చేయడం వంటిదేనని విశాఖపట్నం 198 సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్, ప్లాంటేషన్ డ్రైవ్ నోడల్ ఆఫీసర్ భగత్‌సింగ్ తెలిపారు. శుక్రవారం మధురవాడ గాయత్రి వైద్య కళాశాలలో విశాఖపట్నం 198 సీఆర్‌పీఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు దశకు వస్తున్న తరుణంలో మేరా మాకీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు మొక్కలు నాటడంతో సంరక్షిస్తామంటూ వాటికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ మాట్లాడుతూ కళాశాలలో మొక్కల సంరక్షణ బాధ్యత, పర్యవేక్షణను పలువురు జవాన్లకు అప్పగిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఏడాదిలో కనీసం రెండు మొక్కలైనా నాటేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ఎన్.సుబ్బారావు, డైరెక్టర్ డీవీఎస్ఎస్ రామమూర్తి, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌లు ఆసు కుమారి, ఉదయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రియుడి మోజులో భర్తనే కడతేర్చింది

- కానిస్టేబుల్ హత్యలో కుట్ర భార్యదే..
- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ
- శివాని, ఆమె ప్రియుడు సహా మరొకరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ



నిందితులు శివాని, రామారావు, నీలా

ఎంవీపీకాలనీ: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రమేష్ మృతి విషయంలో తొలి నుంచి అనుమానిస్తున్నదే జరిగింది. శివజ్యోతి అలియాస్ శివానీయే ఆమె ప్రియుడితో కలిసి తన భర్త రమేష్ హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసుల విచారణలో తేలింది. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ శుక్రవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు.

2009 బ్యాచ్‌కు చెందిన బర్రి రమేష్(35) ఆదర్శనగర్‌లో ఉంటూ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం ఉదయం అతను చనిపోయినట్లు ఎంవీపీ పోలీసులకు సమాచారం వచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బెడ్‌పై విగతజీవిగా ఉన్న రమేష్‌ను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. రాత్రి మద్యం సేవించి పడుకున్నాడని, తెల్లవారి లేచి చూసేసరికి చనిపోయి ఉన్నాడని అతని భార్య పోలీసులకు చెప్పింది. అతని ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు సమయంలో ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. తమదైన శైలిలో విచారించడంతో అసలు వాస్తవాలు బయటకొచ్చాయి. పోస్టుమార్టం నివేదికలో సైతం అతను ఊపిరాడక చనిపోయినట్లు తేలింది. దీంతో పోలీసులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేయడంతో కుట్రకోణం వెలుగుచూసింది.

రామారావు అనే టాక్సీ డ్రైవర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న రమేష్ భార్య శివాని.. అతని మోజులో కట్టుకున్న భర్తను మట్టుబెట్టింది. రామారావు విషయంలో గతంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. కాగా.. మంగళవారం రాత్రి ఆమె రమేష్‌తో బాగా మద్యం తాగించి.. దాన్ని వీడియో కూడా తీసింది. కొంతసేపటికి అతను నిద్రలోకి జారుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఆమె ప్రియుడు రామారావుకు సమాచారం ఇవ్వడంతో.. అతని స్నేహితుడు నీలాతో కలిసి ఇంట్లోకి వచ్చాడు. ఆమె సమక్షంలోనే అతనిని వీరు హత్య చేశారు. నీలా రమేష్‌కి ఊపిరాడకుండా దిండుతో నొక్కిపట్టుకోగా.. రామారావు కదలకుండా అతని కాళ్లు పట్టుకున్నాడు. కొద్దిసేపటికి ఊపిరాడక రమేష్ మృతి చెందాడు. ఇలా పక్కాగా రమేష్‌ను హతమార్చిన శివాని, అతని ప్రియుడు రామారావు దీన్ని సాధారణ మృతిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగానే తొలుత మద్యం తాగి చనిపోయాడని శివాని పోలీసులకు చెప్పినట్లు సీపీ వెల్లడించారు. ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వాస్తవాలను రాబట్టినట్లు తెలిపారు. శివానీని ఏ1గా, ప్రియుడు రామారావును ఏ2గా, వారికి సహకరించిన నీలాను ఏ3గా నిర్ధారించి కేసు నమోదు చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.

తొలి నుంచి శివానీది నేర స్వభావమే..

రమేష్ భార్య శివానీది తొలి నుంచి నేర స్వభావమే అని సీపీ తెలిపారు. తల్లిదండ్రులతో సైతం ఆమె పలుమార్లు గొడవ పడినట్లు చెప్పారు. ప్రియుడి విషయంలో భార్యను పలుమార్లు రమేష్ మందలించాడని వెల్లడించారు. ఆమె తీరు కారణంగా విసిగిపోయి ఒక దశలో ఇద్దరు కుమార్తెలను తన వద్ద వదిలేసి ప్రియుడితో వెళ్లిపొమ్మని కూడా ఆమెకు చెప్పాడన్నారు. అయితే పిల్లలు, ప్రియుడు ఇద్దరూ కావాలనే ఉద్దేశంతో శివాని రమేష్ హత్యకు కుట్ర పన్నింది. ఈ హత్యలో సహకారానికి శివానీ, ప్రియుడు రామారావు అతని స్నేహితుడు నీలాకు రూ.లక్ష సుపారి కూడా ఇచ్చినట్లు సీపీ వెల్లడించారు.

18న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

- పలు అంశాల్లో యువతకు పోటీలు

మహారాణిపేట: రుషికొండలోని గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కాలేజీలో ఈ నెల 18న జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సెట్విస్ సీఈవో ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల వయసు కలిగిన యువతీయువకులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. సంస్కృతి కేటగిరీలో జానపద నృత్యం(గ్రూప్) గరిష్టంగా 10 మంది, జానపద నృత్యం (వ్యక్తిగతం), జానపద గీతాలు(గ్రూప్) గరిష్టంగా 10 మంది, జానపద గీతాలు (వ్యక్తిగతం), లైఫ్ స్కిల్ కేటగిరీలో స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ తదితర అంశాల్లో పోటీలు ఉంటుందన్నారు. నాన్ కాంపిటీటివ్ ఈవెంట్స్‌లో డిజిటల్ ఇండియా(గ్రూప్) 3 నుంచి 5 మంది, డిజిటల్ ఇండియా(వ్యక్తిగతం), లైఫ్ మిషన్-పర్యావరణ పరిరక్షణపై ఒకరు, యువకృతిలో పాల్గొనేందుకు హస్తకళల నుంచి ఓ కళాకారుడు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 13లోగా గూగుల్ ఫారం(https:/ forms. gle/ hzPg6 qaNSJgh2 aEjg)లో వివరాలు నమోదు చేసి పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 0891-2558291కు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

సుభోజనానికి రూ.35 లక్షల విరాళం



హోమీ బాబా ఆస్పత్రిలో భోజనం వడ్డిస్తున్న దాత అంకినీడు ప్రసాద్

- ఏడాది పాటు నిర్వహణకు ముందుకొచ్చిన ఎన్ఆర్ఐ

అగనంపూడి: హరేకృష్ణ మూమెంట్, విశాఖపట్నం సారథ్యంలో అగనంపూడి సమీపంలో హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులకు ఏడాది పాటు మధ్యాహ్న భోజనం అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఎన్ఆర్ఐ ముందుకొచ్చారు. నెలన్నర కిందట ఇక్కడ 450 మందికి సుభోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. హరేకృష్ణ మూమెంట్ ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ కోసూరు అంకినీడు ప్రసాద్ శుక్రవారం సుభోజన కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులు, వారి సహాయకులకు భోజనం వడ్డించి, వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఏడాది పాటు ఈ కార్యక్రమ నిర్వహణకు అయ్యే ఖర్చు రూ.35 లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చారు. తర్వాత ఏడాది కూడా కొనసాగిస్తానని సూచనప్రాయంగా చెప్పారు. హరేకృష్ణ మూమెంట్ విశాఖ అధ్యక్షుడు యదురాజా దాస మాట్లాడుతూ దాత అంకినీడు ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలు సహకారం అందించాలని భావిస్తే 96667 62108కు సంప్రదించాలని కోరారు.

'పూల లోయ' ట్రెక్కింగ్‌కు పయనం



ట్రెక్కింగ్‌కు బయలుదేరిన యూత్ హాస్టల్స్ బృందం

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఉక్కునగరం యూనిట్ ఆధ్వర్యంలో 14 మంది ఉత్తరాఖండ్ 'పూల లోయ'ట్రెక్కింగ్‌కు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. యూనిట్ ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు నేతృత్వంలో యూనిట్ సభ్యులు రిషికేష్ నుంచి ప్రారంభించి జ్యోతిర్ మఠం, పూలలోయ, హేమకుండ్, బద్రీనాథ్, వసుధార తదితర ప్రాంతాల్లో 9 రోజుల పాటు ట్రెక్కింగ్ చేయనున్నారు. వందల ఎకరాల్లో సహజ సిద్ధంగా విస్తరించి ఉన్న పూల లోయ, సుమారు 4,220 మీటర్ల ఎత్తులో ఉన్న హేమకుండ్ ప్రాంతానికి నడిచి వెళ్లడం సాహసమేనని యూనిట్ కార్యదర్శి వి.ఆర్.కె. రాజు తెలిపారు.

వైభవ్ జ్యువెలర్స్‌కు అరుదైన గుర్తింపు



అవార్డును అందుకుంటున్న వైభవ్ జ్యువెలర్స్ సీఎండీ గ్రంధి మల్లిక రత్నకుమారి

దొండపర్తి: వైభవ్ జ్యువెలర్స్‌కు మరో అరుదైన గుర్తింపు లభించింది. ఐఐజేఎస్ ప్రీమియర్ షో సందర్భంగా రత్నాలు, ఆభరణాల ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) చైర్మన్ విపుల్ షా అధ్యక్షతన దేశంలో 20 మంది రిటైలర్ల విజయాలను గుర్తించి సత్కరించింది. ముంబయిలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖకు చెందిన వైభవ్ జ్యువెలర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి భారత మల్లిక రత్నకుమారి ఈ ఇండస్ట్రీ లెజెండ్‌లలో ఒకరిగా స్థానాన్ని దక్కించుకున్నారు. పరిశ్రమ వృద్ధికి ఆమె చేసిన విశిష్ట కృషిని అభినందిస్తూ జీజేఈపీసీ మల్లిక రత్నకుమారిని ఇండస్ట్రీ లెజెండ్ అవార్డుతో సత్కరించింది.

వరల్డ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభం



ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న నషీద్ చౌదరి

కొమ్మాది: ప్రపంచంలోని వివిధ దేశాల్లో గల ప్రముఖ విశ్వవిద్యాలయాలు అందించే కోర్సులు, ప్రవేశం పొందే వివరాలు తెలియజేసేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా శుక్రవారం వరల్డ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభమైంది. ఈ ఫెయిర్‌ను భారత్-గల్ఫ్ ప్రాంత పశ్చిమ ఆస్ట్రేలియా ట్రేడ్ కమిషనర్ నషీద్ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో విద్యాభ్యాసంతో పాటు నిపుణులకు విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని.. ఈ మేరకు విద్యార్థులు స్వాగతిస్తున్నట్లు తెలిపారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తదితరులు పాల్గొన్నారు. శనివారంతో ఈ ఫెయిర్ ముగుస్తుంది.

వెంకన్న సన్నిధిలో మేయర్ దంపతులు

అల్లిపురం: మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శ్రీనివాస్ దంపతులు శుక్రవారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నుంచి పరిపాలన కొనసాగించాలని కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. వెంకన్న ఆశీస్సులు విశాఖ ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్టార్టప్‌లు దోహదం

బీచ్‌రోడ్డు: దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్టార్టప్‌లు ఎంతగానో దోహదపడతాయని సీఐఐ విశాఖపట్నం వైస్ చైర్మన్ రాజేష్ గ్రంధి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో యువ జన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో శుక్రవారం వై20 బ్రెయిన్ స్టోర్మింగ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 670 జిల్లాల్లో 99,000 గుర్తింపు పొందిన స్టార్టప్‌లతో.. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్ కలిగి ఉన్నామన్నారు. 338.50 బిలియన్ల డాలర్ల విలువైన 105 యూనికార్న్‌లను కలిగి ఉన్నట్లు వెల్లడించారు. 2025 నాటికి రెండో స్థానం చేరుకుంటామని అంచనా వేశారు. భారత్‌లో నమోదైన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాలకు చెందినవే అన్నారు. సమావేశంలో జీవీపీ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రజని, శిల్పరంజని తదితరులు పాల్గొన్నారు.